# పిల్లి కథ

"మ్యాఁ! మ్యాఁ!"

"అమ్మోయ్, పిల్లి కూనేవ్!" అన్నది చిట్టి.

"తెల్లగా ఎంత ముద్దొస్తుందో!...." అన్నాడు బుల్లాడు.

"ఛీ! ఛీ! దాన్ని ముట్టుకుంటారేమర్రా. పిల్లిని ముట్టుకుంటే పంచమహా పాతకాలూ చుట్టుకుంటై!" అన్నాడు నాన్న.

"మ్యాఁ! మ్యాఁ!" అన్నది కూన.

"చూడు నాన్నా, ఎట్లా దగ్గిరకొస్తుందో" అన్నాడు బుల్లాడు.

"ఇది పెంపుడు పిల్లి. అందుకే పారిపోవటంలేదు." అన్నది చిట్టి

"చూడు నా చెయ్యి ఎట్లా నాకుతుందో!" అన్నాడు బుల్లాడు.

"దాని కాకలవుతోంది." అన్నది చిట్టి.

"చెబితే మీకా్కదుటర్రా? దాన్ని వెళ్ళగొట్టండి ముందు....బొచ్చంతా రాలి పోయి ఎంత అసహ్యంగా ఉందో, దాని ముట్టుకున్నారంటే మీక్కూడా చీడ పట్టు కుంటుంది" అన్నాడు నాన్న.

"దాని కాకలవుతుంది నాన్న, కొంచెం అన్నంపెట్టి వెళ్ళగొడతాం" అన్నది చిట్టి.

"దానికి చీడలేదు, నాన్న" అన్నాడు బుల్లాడు. మజ్జిగా అన్నమూ కలిపి పెడితే కూన ఉత్సాహంగా తిన్నది.

అనుకున్న ప్రకారం కూన ఇల్లు వదిలిపోలేదు. అది ఇల్లు తన సొంతం చేసుకున్నది. అందరితోపాటు ప్రతిపూటా తిండికొచ్చేది. మిగతా సమయాల్లో ఎండ పొడో, వెచ్చనిచోటో చూసుకుని నిద్రపోయ్యేది. రాత్రిపూట ఎవరో ఒకరి పక్కల్లో పడుకునేది. దాని యిష్టం వచ్చినప్పుడు బయటికివెళ్ళి పెత్తనాలు చేసి వచ్చేది.

నాన్నకు పిల్లిని చూస్తే చాలా కోపంగా ఉండేది. 'ఏమిటీ వెధవ పిల్లి? పొద్దునే మనకు దీని దర్శనం! అస్తమానమూ ఏ పని చేసుకోబోయినా అడ్డం వస్తూం టుంది....పిల్లలూ, మీరు దీన్ని మచ్చికచేస్తే ఊరుకోను. రెండు పూటలు తిండి వెయ్యకుండా ఉంటే అదేపోతుంది" అన్నాడు నాన్న.

"ఏం, నాన్నా, పాపం...." అన్నది చిట్టి.

"పిల్లి పాపిష్టిది. ఇంకా కుక్క నయం. విశ్వాసంగల జంతువు. దానికి స్వామి భక్తి ఉంది. పిల్లికి విశ్వాసం లేదు. తన సుఖమే చూసుకుంటుంది. ఇంకొకరి సుఖం ఓర్చలేదు. మనం ఏదన్నా తింటుంటే శాపనార్థాలు పెడుతుంది. పిల్లి శాపనార్థాలంటే అవే మనం తినే ముద్దలుకూడా లెక్క పెడుతుంది" అన్నాడు నాన్న.

"పిల్లికి ఒంట్లు వచ్చా నాన్నా!" అన్నాడు బుల్లాడు.

"దాని ఒంట్లు దానికొచ్చులే." అన్నాడు నాన్న చిరాకుగా.

పిల్లికి కూడ కృతజ్ఞత ఉంటుంది, నాన్నా. అది నాతోనూ, బుల్లాడితోనూ ఆడుకుంటుందిగాని నీతో ఆడుకోదేం!" అన్నది చిట్టి.

"ఏమైనా దానికి అన్నం పెడితే నేను ఒప్పుకోను. మనుషులకే తినటానికి లేకుండా ఉంది!" అన్నాడు నాన్న.

"దాని తిండెంత, నాన్నా? మనం పారేసినంత ఉండదూ?" అన్నాడు బుల్లాడు.

"వీల్లేదు." అన్నాడు నాన్న.

* * * *

"చూడండి. ఈ దిక్కుమాలిన పిల్లి ప్రద్దాన్లోనూ మూతిపెడుతున్నదీ! ఎట్లా చచ్చేది దీంతో!" అన్నది అమ్మ.

"గోతాలు పెట్టి ఉరిబయట విడిచొస్తేగాని దీనిపీడ వదలదు."

దాన్ని అన్నం పెట్టక చంపుతుంటే ఏం చేస్తుందే?" అన్నాడు బుల్లాడు.

"దాన్నెవరు మేపుతారు? దాని తిండి అది చూసుకోమను" అన్నాడు నాన్న.

"దాని తిండి ఏం చూచుకొంటుంది. ఇప్పుడింటో ఎలికెలు కూడా లేకుండాపోయినై" అన్నాడు బుల్లాడు.

"అవును పాపం దాని ధర్మమా అంటూ ఈ పిల్లొచ్చాక ఎలికెల బాధ లేదు." అన్నది అమ్మ.

"అది ఎలికెల్ని పట్టినా మనం దానికన్నం పెట్టం" అన్నది చిట్టి.

"మనమే కృతజ్ఞత లేనివాళ్ళం" అన్నాడు బుల్లాడు.

"ఇంకేం ఎలికెల్ని పట్టుకోమను? మళ్ళీ అన్నం కూడా దేనికి?" అన్నాడు నాన్న.

"ఎలికెలు అయిపోయినకొద్దీ మనకు లాభం దానికి నష్టం. ఇదేం న్యాయము నాన్నా!" అన్నాడు బుల్లాడు.

"పట్టుకునేటందుకు ఎలికెలు లేకపోతే ఇంకా ఈ పీనిగె మన కొంపలో దేనికి?" అన్నాడు నాన్న.

"అక్కర తీరితే అల్లుడు లంజకొడుకు" అన్నాడు బుల్లాడు.

"పట్టుకునేటందుకు ఎలికెలు లేకపోతే ఇంకా ఈ పీనిగె మన కొంపతో దేనికి?" అన్నాడు నాన్న.

"అక్కర తీరితే అల్లుడు లంజకొడుకు" అన్నాడు బుల్లాడు.

"అది ఇంటో ఉండగూడదర్రా వెధవ చీడపిల్లి? దాన్ని ముట్టుకుంటేనే రోగాలొస్తాయి" అన్నాడు నాన్న.

"చీడపిల్లా నాన్నా? చూడు దాని వొంటినిండా ఊలుబంతల్లే ఎంత బొచ్చో. బలిసి ఎంత ముద్దొస్తున్నదో !!" అంది చిట్టి.

"మనింటో బాగా పాలూ, మజ్జిగా తిని కొవ్వింది. లావుగా ఉండదూ ?" అన్నాడు నాన్న.

"చిక్కితే చిక్కిందంటావు. బలిస్తే బలిసిందంటావు. యెట్లా నాన్నా ?" అన్నాడు బుల్లాడు.

"మనం మనుష్యులంకదా. పిల్లుల్ని దగ్గిర పడుకోబెట్టు కోవటమూ, దాన్ని ఎత్తుకుని ఆడుకోవటమూ అసహ్యం కాదుట్రా ?" అన్నాడు నాన్న.

"అది మనకన్న శుభ్రంగా ఉంటుంది. రోజుకు పదిసార్లు ఒళ్ళంతా నాక్కుంటుంది. పక్కమీద ఉచ్చకూడా పొయ్యదు" అన్నది చిట్టి.

నాన్న మాట్లాడలేదు. కాని, మర్నాటినించి పిల్లికూడా కనపళ్ళేదు. నాన్న ఏంచేశాడో మరి.

* * * *

కిస్మస్ శెలవులకి బావొచ్చాడు.

చిట్టీ, బుల్లాడూ బావచెరో చెయ్యీపట్టుకు వేళ్ళాడుతూ పిల్లి కథంతా చెప్పారు.

"పిల్లిని వెళ్ళగొట్టటం అన్యాయమే" అన్నాడు బావ. "మచ్చిక చెయ్యని పిల్లి దాని యిష్టం వచ్చినట్లు అది జీవిస్తుంది. తిండి దొంగిలిస్తుంది. కొట్టబోతే పారిపోవటం నేర్చుకుంటుంది. దాని బతుకు అది చూసుకుంటుంది. కాని మనం దాన్ని మచ్చిక చేసిన తరువాత దాని బతుకు అది చూసుకోలేదు. ఎలికెల బాధ కోసం పిల్లిని పెంచి ఎలికెలబాధ పోగానే దాన్ని వెళ్ళకొట్టేస్తే దానిగతి ఏం కానూ ? కొన్నాళ్ళు మనుషులు దానికి తిండి పెట్టటంచేత మనిషి శత్రువనే జ్ఞానం దానికి లేకుండా పోతుంది. దొంగతనంగా తిండి సంపాదించటం దాని కలవాటుండదు. మనిషిని నమ్ముతూ అది తిండిలేక చస్తుంది. ఆ పాపం పెంచిన వాళ్ళను చుట్టుకుంటుంది" అన్నాడు బావ.

"ఇప్పుడు మళ్ళీ మనింటో ఎక్కడ చూసినా ఎలుకలే" అన్నది చిట్టి.

"ఎందుకుండవూ ? పిల్లి ఉన్నంతకాలమూ దాని ఉపయోగం ఏమీ, లేనట్టే ఉంటుంది. అది పోయిన తరువాతగాని దాని ప్రయోజనం తెలియదు" అన్నాడు బావ.

"పిల్లులు మంచివి కావంటాడే నాన్న ? వాటిని ముటుకుంటే పంచ మహా పాతకాలు చుట్టుకుంటాయట. వాటిని ముట్టుకుంటే రోగం కూడా వస్తుందట" అన్నాడు బుల్లాడు.

"దానిబతుకు దాన్ని బతకనివ్వక మనం దాన్ని సరిగా చూడనప్పుడు పిల్లి అనారోగ్యంగా ఉండదూ ? వొంటినిండా చీడపడుతుంది. బొచ్చంతా రాలి పోతుంది. మనం చూడకుండా అది మనం తినేవాటిని ముట్టుకోవచ్చు. మన పక్కల్లో పడుకోవచ్చు. మన గిన్నెల్లో మూతి పెట్టవచ్చు. అట్లాకూడా మనకు రోగా లొస్తాయి....అంతేగాని మనం శ్రద్ధగా పెంచే పిల్లి ఎంత ఆరోగ్యంగానైనా ఉంటుంది. దానివల్ల మనకూ మనవల్ల దానికీ లాభం ఉంటుంది" అన్నాడు బావ.

బావ ఈ మాట అంటుండగానే బుల్లాడు దూరంగా ఒక పిల్లిని చూశాడు. బయట గడ్డిలో ఏదో వెతుకుతున్నది పిల్లి.

"అది మన పిల్లే బావా !" అన్నది చిట్టి.

బావా, చిట్టీ, బుల్లోడు కలసి పిల్లిని చూడటానికి బయటికొచ్చారు. వాళ్ళు దగ్గిరికి రావడం చూచి పిల్లి నాలుగు గజాలు పారిపోయి వాళ్ళకేసి భయంతో చూస్తూ నిలబడింది.

"చూశావా, చిట్టీ. మన పిల్లి ఎట్లా అయిపోయిందో, దాని వొంటిమీద బొచ్చంతా రాలిపోయి, చిక్కిపోయి ఎట్లా ఉందో ?" అన్నాడు బుల్లోడు.

"ఛీ. పాడుపిల్లి, మనకొద్దు ?" అన్నది చిట్టి.

"మనింటో ఎలికెలో" అన్నాడు బావ.

"ఎలికలయితేమటుకు దీన్నెట్లా పెంచుతాం బావా ?" అన్నది చిట్టి.

"అట్లాకాదే, చిట్టీ. దీనికి నాలుగు రోజులు తిండి పెడితే మళ్ళీ బాగా బలుస్తుంది. వొంటినిండా బొచ్చొస్తుంది. ఎలికెల్ని కూడా పడుతుంది !" అన్నాడు బావ.

"నేను పట్టుకోనా?" అంటూ బుల్లాడు పిల్లిదగ్గిరి కెళ్ళాడు. పిల్లి భయపడుతూ ముడుచుకుపోయి, పీలగొంతుతో, "మ్యా !" అన్నది.

"ఎంత జాలిగా అరుస్తోందో !" అన్నది చిట్టి.

పిల్లి ఇప్పుడు బాగా బలిసింది. చిట్టితోనూ బుల్లాడితోనూ చాలా సరదాగా ఆడుకుంటుంది. ఇంటో ఎక్కడా ఎలికె అలికిడిలేదు. అది ఒక్కసారి నాన్న పక్కమీదికే వెళ్ళి దర్జాగా పడుకుంటుంది. నాన్న దానికేసి అనుమానంగా చూస్తాడు గాని, ఏమీ అనడు.

ముద్రణ:- అభ్యుదయ; డిసెంబరు 1946